క్లుప్తంగా

చెంబకూరులో డెంగీపై అవగాహన ర్యాలీ

రామసముద్రం : మండలంలోని చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం డెంగీ నివారణ మహోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జాహ్నవి, చరిత, ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులచే పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్లో మానవహారం చేపట్టారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీటి కుంటలు, చెత్త తొలగించి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నిల్వ నీటిలో దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ జీకె. చంద్ర, ఎఎన్ఎం లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిపో ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి

మదనపల్లె సిటీ : సిబ్బంది సమష్టిగా పని చేసి ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ఆర్టీసీ-2 డిపో మేనేజర్ అమరనాథ్ అన్నారు. శుక్రవారం డిపో ఆవరణంలో ఆదర్శ ఉద్యోగుల అభినంద సభ ఏర్పాటు చేశారు. అత్యధికంగా కెఎంపిఎల్, ఈపీకె తెచ్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు చెక్‌లను అందజేశారు. ఉద్యోగులు డ్యూటీలు సక్రమంగా చేసి డిపో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డిపోను రీజియన్‌లో మొదటి స్థానం వచ్చేలా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీలో ఎగువ, దిగువ బండమీద పల్లి, బురదవాండ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం జరిగిన పీర్ల ఊరేగింపును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రజలు పీర్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలతో మొక్కులు చెల్లించుకున్నారు.

పీలేరులో భారీ వర్షం

– జలమయమైన బస్టాండ్

పీలేరు : పీలేరులో రెండు రోజుల పాటు భారీ వర్షం కురిసింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మురుగు నీటి కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు మొత్తం బస్టాండ్ ప్రాంగణాన్ని ముంచెత్తింది. బస్టాండ్ ఫుట్‌పాత్‌పైకి నీరు ప్రవహించి బస్టాండ్‌లోని దుకాణాలు, హోటల్లోకి సైతం వర్షపునీరు వెళ్లింది. ప్రయాణికులు కనీసం నిలుచుకునేందుకు కూడా చోటు లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ నుంచి డ్రైనేజ్ వ్యవస్థ శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మల్లయ్యకొండపై గోపూజ

కురబలకోట : అంగళ్లు మల్లయ్య కొండపై ఆంజనేయ కుమార్, శ్రీదేవి దంపతులు శుక్రవారం ఘనంగా గోపూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు. మదనపల్లె రూరల్ మండలం వైఎస్సార్ సీపీ నాయకులు, సీటీఎం సర్పంచ్ ఆనందపార్థ సారధి ఉదారంగా పుంగనూరు ఆవును మల్లయ్యకొండకు సమర్పించారు. విశాఖ పట్టణంకు చెందిన వీర్రాజు దాతృత్వం వహించారు. కాలువపల్లె సవరాల కృష్ణమూర్తి, లక్ష్మీదేవి. గుండాల సుబ్బమ్మ తదితరులు ఈ సందర్భంగా జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలి

– డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మిపతి

మదనపల్లె సిటీ : మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మిపతి అన్నారు. శుక్రవారం మదనపల్లె చంద్రకాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన, ఒకేషనల్ ట్రైనింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించారు. స్టాక్‌రూములో స్టాకు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరిసర ప్రాంతంను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లీశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, ఒకేషనల్ టీచర్లు మాళవిక స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ

తంబళ్లపల్లె : ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్‌లో విద్యార్థులకు మెనూ మేరకు వంటలు వండి వడ్డించాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ థామస్,ఎంఈఓ త్యాగరాజుతో కలిసి మహాత్మాపూలే బీసీ బాలురు హాస్టల్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లోని హాస్టల్స్‌ను పరిశీలించారు. శుభ్రత పాటిస్తూ వంటలు నాణ్యతగా వండి పెట్టాలన్నారు. తరగతుల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

తంబళ్లపల్లె : అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సీడీపీఓ సుజాత తెలిపారు. శుక్రవారం కన్నెమడుగు, అప్పమ్మగారిపల్లె, గోపిదిన్నె, శ్రీనివాసకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకుని లబ్ధిదారులకు వచ్చే పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. రెండు యాప్‌ల ద్వారా జరిగే కార్యక్రమాలను రోజువారి పూర్తి చేయాలన్నారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో చర్చించి సర్టిఫికెట్లుతో ఆధార్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

తంబళ్లపల్లె : ఆస్పత్రులకు వచ్చే గ్రామీణ రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సిని తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ, పరిశుభ్రత,రోగులకు అందుతున్న సేవలు, మందుల పరిస్థితి, డాక్టర్లు, సిబ్బంది కొరత, ఓపీ వివరాలు మెడికల్ ఆఫీసర్ తేజస్విని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఎక్స్‌రే విభాగం, ఆపరేషన్ థియేటర్, మెటర్నటీ వార్డు, మందుల పంపిణీ విభాగాన్ని పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎప్పుడు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది స్నేహపూర్వకంగా మెలిగి విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా ? లేదా అన్న విషయాలను సీఎంఓ నుంచి ప్రజల అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాదృక్పదంతో విధులు నిర్వహిస్తూ రోగులకు వైద్య సేవలు అందించి అనుకున్న లక్ష్యాల మేరకు పనిచేయాలన్నారు. సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎర్రసానిపల్లె, గోపిదిన్నె సంపద సృష్టి (డపింగ్ యార్డు) కేంద్రాలను పరిశీలించారు. గోపిదిన్నె పంచాయతీ నుంచి పొడిచెత్త,తడిచెత్త సేకరణ జరగలేదంటూ సీఎంఓ కార్యాలయానికి ప్రజాభిప్రాయం వెల్లిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి పారిశుద్ధ్య కార్మికులచే చెత్తసేకరణ సక్రమంగా జరిగే విధంగా చూడాలని ఎంపిడిఓ థామస్‌కు సూచించారు. ఆయన వెంట నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ తాగ్యరాజు తదితరులు ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

పీలేరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి కృష్ణ కిషోర్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని కాన్పుల గది, మరుగుదొడ్లు పరిశీలించారు. అలాగే ఓపీ, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యులు సమయ పాలన పాటిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, వైద్యులు శ్రీగిరిష్మ, చంద్రశేఖర్‌నాయక్, హెచ్ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.



తలపుల పీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి కృష్ణకిషోర్

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

గుర్రంకొండ : ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీఎండీహెచ్‌ఓ లక్ష్మీనరసయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తరిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా సిబ్బంది రిజిష్టరు, మందుల రిజిష్టర్, ఆస్పత్రి రికార్డులు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న వసతులపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని కొన్ని పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని ఆస్పత్రి వైద్యులు చిన్నరెడ్డెయ్య దృష్టికి తీసుకొచ్చారు. ఫార్మాసిసిట్టు పోస్టును చిన్నమండ్యం ఆస్పత్రి నుంచి డిప్యూటేషన్‌పై నియమిస్తామని డీఎండీహెచ్‌వో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌క్యాష్ ప్రోగ్రామ్ కింద తొందరలోనే రాష్ట్ర ప్రత్యేక టీమ్ ఆస్పత్రులను తనిఖీ చేస్తారన్నారు. ఇందులో భాగంగా ఆస్పత్రుల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత రానీయకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చిన్నరెడ్డెయ్య, ఎంపీహెచ్‌ఈవో హరినాథ్, స్టాఫ్‌నర్సు గీత, పీహెచ్‌న్ మద్దమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



తరిగొండ ప్రభుత్వాస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎండీహెచ్‌ఓ లక్ష్మీనరసయ్య

అమ్మకు వందనం అందలేదని ఫిర్యాదు



మోడల్ స్కూల్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నిమ్మనపల్లె : అమ్మకు వందనం పథకానికి సంబంధించి డబ్బులు తమకు అందలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంపీడీఓ రమేష్‌బాబు, ఎంఈఓ పద్మావతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తమ పిల్లలు మండలంలోని రెడ్డివారిపల్లె మోడల్‌స్కూల్‌లో చదువుతున్నారని, తమకు తల్లికి వందనం పథకానికి సంబంధించిన నిధులు మొదటి, రెండో విడతల్లోనూ జమకాలేదన్నారు. ఈ విషయమై పలుమార్లు పాఠశాలలోనూ, సచివాలయంలోనూ సంప్రదించినా సరైన స్పందన లేదన్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను కలిసి ఈ సమస్యపై అడిగితే తాము చేయగలిగినది ఏమీ లేదని, విద్యార్థుల వివరాలు నమోదు చేశామని, సచివాలయంలో తెలుసుకోవాలని సూచించారన్నారు. అయితే సచివాలయంలో సంప్రదిస్తే సిబ్బంది తాము చేసేదేమీ లేదని, పాఠశాలకు వెళ్లాలని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లల వివరాలు ఇటు అర్హత, అటు అనర్హత జాబితాల్లో కనిపించలేదన్నారు. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామన్నారు. మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు మాత్రమే ఈ సమస్య తలెత్తిందన్నారు. అధికశాతం మంది విద్యార్థులకు తల్లికి వందనం నిధులు అందలేదన్నారు. ఈ విషయమై ఎంఈఓ-2 నారాయణను విచారిస్తే...సమస్య తమ దృష్టికి వచ్చిందని, సాంకేతిక కారణాలతో అమ్మకు వందనం నిధులు జమకాకుండా ఉంటాయన్నారు. సమస్యను పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బందితో కలిసి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలి

ఈఓ ఏకాంబరంకు విన్నవించిన బీసీ ఐక్యవేదిక నాయకులు



బోయకొండ ఈఓ ఏకాంబరంకు వినతిపత్రం అందిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

మదనపల్లె రూరల్ : చిత్తూరు జిల్లాలో ప్రముఖ శక్తి క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యం కోసం ప్రథమ చికిత్స కేంద్రంతో పాటుగా అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని బీసీ ఐక్యవేదిక నాయకులు విన్నవించారు. శుక్రవారం ఆలయ ఈఓ ఏకాంబరంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు జన్నే రాజేంద్రనాయుడు మాట్లాడుతూ...ఈనెల 16న బెంగళూరుకు చెందిన బాలమురళీ, కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకునేందుకు రావడం జరిగిందన్నారు. ఆలయంలో దర్శనం తర్వాత వెలుపలికి వచ్చేటప్పుడు ఛాతీలో తీవ్రమైన నొప్పి అధికం కావడంతో అత్యవసర పరిస్థితి ఏర్పడిందన్నారు. స్థానికంగా అత్యవసరంగా ప్రథమ చికిత్స అందించేందుకు ఆస్పత్రి లేకపోవడం, రోగిని తరలించేందుకు అంబులెన్స్ లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడిందన్నారు. హుటాహుటిన కుటుంబసభ్యులు అతడిని ప్రైవేట్ వాహనంలో మదనపల్లెలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడుకోవడం జరిగిందన్నారు. నిత్యం వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చే పుణ్యక్షేత్రంలో కనీస వైద్య సదుపాయాలు లేకపోవడం విచారించాల్సిన విషయమన్నారు. ఇకపై భక్తులకు ఇలాంటి ఇబ్బందులు జరగకుండా ఉండేందుకు అమ్మవారి కొండపై భక్తుల సౌకర్యం కోసం ప్రథమచికిత్స కేంద్రం, అంబులెన్స్ వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సగర(ఉప్పర) సంఘం అధ్యక్షులు కట్టాగంగులప్ప, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఎం.సుబ్రహ్మణ్యం, బి.సుబ్రహ్మణ్యం, ఆవుల విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వసతులు కల్పించండి



గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న స్పెషలాఫీసర్ రవికుమార్

గుర్రంకొండ : ఏపీగురుకుల పాఠశాలలో తగిన వసతులు కల్పించాలని విద్యార్థినులు మండల స్పెషలాఫీసర్ రవికుమార్‌ను కోరారు. శుక్రవారం ఆయన స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పాఠశాలను గత కొన్నేళ్లుగా రేకులషెడ్లలో నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థిలు అన్నారు. తరగతి గదులు చాలడం లేదని గదుల కొరతతో తరగతి గదుల్లో చదువుకోవడం అక్కడే పడుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. మరుగుదొడ్లలో నుంచి డ్రైనేజి నీరు బయటకు వెళ్లక పోవడంతో దుర్గంధం భరించలేకున్నామని ఫిర్యాదు చేశారు. రేకులషెడ్లు కావడంతో తమకు రాత్రిళ్లు రక్షణ లేదని వారు పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినిలకు వడ్డిస్తున్న ఆహారపదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు. విద్యార్థినిల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఎంఈవో సురేంద్రబాబు, మండల ఆర్‌ఐ సదాశివ, ప్రిన్సిపల్ శిరిష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌టీఈ విద్యార్థులకు నిధులు విడుదల చేయాలని వినతి

బహుజన యువసేన అధ్యక్షులు పునీత్



సబ్ కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవికి వినతిపత్రం అందిస్తున్న బీవైఎస్ పునీత్

మదనపల్లె రూరల్ : విద్యాహక్కు చట్టం(ఆర్‌టీఈ) మేరకు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు సంబంధించిన ఫీజులను రాష్ట్రప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏఓ నిర్మలాదేవిని కలిసి, ఆర్‌టీఈ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ 2009 లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఏ ద్వారా 6 నుండి 14 సంవత్సరాల పిల్లలు వారి ఆర్థిక పరిస్థితుల వల్ల, విద్యకు దూరం కాకూడదనే ముఖ్య ఉద్దేశంతో విద్యా హక్కు చట్టాన్ని తెచ్చారన్నారు. ఈ చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు 2024–25 కి సంబంధించిన ఫీజులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల వారికి చెల్లించకపోవడంతో, వారు తల్లిదండ్రులు దగ్గర బలవంతంగా 30 నుంచి 50 వేల వరకు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఫీజులు చెల్లించని వారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంల జిలాని భాష,శశి కుమార్, వినయ్, పూర్ణ, శ్రీనివాసులు, బాలకృష్ణ, వేణుగోపాల్, ద్వారకనాథ్, దేవేష్, వంశీ, ఆరిఫ్ పాల్గొన్నారు.

చెత్తసేకరణ సక్రమంగా నిర్వహించాలి

ఆర్డీవో శ్రీనివాసులు



రామాపురంలో చెత్తసేకరణ కార్మికులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

గుర్రంకొండ : గ్రామాల్లో చెత్తసేకరణ పనులు సక్రమంగా నిర్వహించాలని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని రామాపురంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలోని డంపింగ్‌యార్డును పరిశీలించారు. డంపింగ్‌యార్డును వినియోగించకపోవడంతో గ్రామంలోని చెత్తను సమీపంలో వంకలో వేస్తున్నారని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గ్రామం మొత్తం తిరిగి పరిసరాలను పరిశీలించారు. ప్రస్తుతానికి డంపింగ్ యార్డు వినియోగంలో లేనందున చెత్తబండ్ల ద్వారా చెత్తను తరిగొండ డంపింగ్‌యార్డుకు తరలించాలని ఆదేశించారు. గ్రామంలో ఎక్కడా చెత్తకుప్పలు ఉంచవద్దని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. చెత్తసేకరణ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వారికి జీతాలు ఎలా చెల్లిస్తున్నారు. ఎంత జీతాల పెండింగ్‌లో ఉన్నాయో ఆరా తీశారు. అనంతరం గ్రామసచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుపట్టిక, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులందరూ సమయ పాలన పాటించాలని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులొ ఉండి సమస్యలను పరిష్కరించేందుకు అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, మండల ఆర్‌ఐ సదాశివ, సర్పంచ్ ఆనంద, వీఆర్వోలు వెంకట్రమణ, మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రోగులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి(వాల్మీకిపురం) : పీలేరు నియోజకవర్గానికి సంబంధించిన పలువురు రోగులు తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వారిని పరామర్శించి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని సంబంధిత వైద్యులను ఆదేశించారు. వాల్మీకిపురం పట్టణానికి చెందిన గండికోట శ్రీనివాసులు భార్య శివకుమారితో పాటు పలువురిని పరామర్శించి, వారి ఆరోగ్య స్థితిపై వైద్యులను విచారించారు. వారు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బిద్దల కేశవరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

తంబళ్లపల్లె : ఉద్యోగులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అవహన సదస్సు జరిగింది. సమాచార హక్కు చట్టం మేరకు ఎవరైనా తగు సమాచారాన్ని కోరితే వారికి నిర్ణీత సమయంలో సంబంధిత సమాచారాన్ని అందజేయాలన్నారు. ప్రతి శాఖ సంబంధిత సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్,ఆరోగ్య, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ థామస్, ఎంఈఓ త్యాగరాజు, పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమం వైఎస్సార్ సీపీకే సాధ్యం

సమన్వయకర్త నిసార్ అహ్మద్



పోతబోలులో ముస్లిం సోదరులతో సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె రూరల్ : మైనారిటీల సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణంలోని కోర్టులో గంగమ్మగుడి, మండలంలోని పోతబోలు గ్రామంలో జుమ్మా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మైనారిటీల సంక్షేమానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మైనారిటీలకు అన్ని విషయాల్లో పెద్దపీట వేసి రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ముస్లిం సమాజానికి అండగా నిలిచారన్నారు. కూటమిప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలు మోసపోవడం తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చెప్పిన తేదీ ప్రకారం చెప్పినట్లుగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు ఠంచనుగా అందిస్తే...నేడు కూటమిప్రభుత్వంలో ఏడాది పూర్తి అయినా ఎన్నికల హామీలు నెరవేర్చకపోగా, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నార ని, జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా లక్షల సంఖ్యలో ప్రజలు హాజరై తమ కష్టాలను చెప్పుకునేందుకు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, కరీముల్లా, మురాద్, ఇస్మాయిల్, రియాజ్, షంషీర్, నూర్ మొహిద్దీన్, జహీర్, ఫకృద్దీన్, నాసిర్, హబీబ్, యాసిన్, సాదిక్, అబ్దుల్లా, ఖిజార్‌ఖాన్, జైనుల్లా, సత్తార్‌సాబ్, మసీదు కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయండి



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మల్లేశ్వరి

పీలేరు రూరల్ : పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పీలేరు నియోజకవర్గం గుర్రంకొండకు చెందిన డి. మల్లేశ్వరిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం ఆమె తిరుపతిలో మాజీ మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి కల్పించి మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తోపాటు మాజీ మంత్రికి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వైఎస్సార్‌సీపీ సమావేశాలు

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయా మండలాల్లో నిర్వహించే సమావేశాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమ నిర్వహణ, పార్టీ కార్యక్రమాల నిర్వహణపై చర్చిస్తారు. సమావేశాలకు పార్టీ శ్రేణులతోపాటు ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యవర్గాల్లోని నాయకులు హాజరవుతారు.

మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఫయాజ్



బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా బి.కొత్తకోటకు చెందిన ఎస్ఎస్.ఫయాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కమిటీ ప్రకటన విడుదల చేసింది. పార్టీలో క్రియాశీలంగా పని చేస్తున్న ఫయాజ్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు.

పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ

పెద్దతిప్పసముద్రం : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 సర్వేలో భాగంగా శుక్రవారం అధికారులు మండలంలోని బూర్లపల్లి, తుమ్మరకుంట, టి.సదుం పంచాయతీల్లో పర్యటించారు. సచివాలయాలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతపై తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, మురికి కాలువలను తనిఖీ చేసి బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతపై పర్యవేక్షించారు. మండల రిసోర్స్ పర్సన్ ఆంజినేయులు, ఈవోఆర్డీ మోహన్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని హెచ్‌పీఈ హెచ్‌ఆర్ జగదీష్ అన్నారు. శుక్రవారం చిత్తూరు రోడ్డులని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు కెరీర్ ప్రిపరేషన్‌పై సెమినార్ నిర్వహించారు. విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్లు, ప్రస్తుత జాబ్ మార్కెట్ పరిస్థితులు, ఉద్యోగ అవకాశాలలు పొందేందుకు అనుసరించాల్సిన పద్ధతులు గురించి వివరించారు. ఇలాంటి సెమినార్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, డీన్ భాస్కర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కేదార్‌గౌరవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి. విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ మెయిన్ స్కూల్ నందు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, కలరా తదితర వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధుల నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఫ్యారూఖాన్, ఉపాధ్యాయులు నరసింహులు, వైద్య సిబ్బంది చిన్నప్ప, మనోహర్, శివప్రసాద్, హెచ్ఈ కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భవితకు 10సూత్రాలు

కలకడ : నేటి బాలికలు అబలలు కాదు అని వారి భవిత కోసం 10సూత్రాలు పాటించాలని గుర్రంకొండ రిడో స్వచ్ఛందసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కలకడ ఆదర్శపాఠశాల, కస్తూర్బా గాంధీబాలికలగురుకుల పాఠశాల, కె.బాటవారిపల్లె పంచాయతీ గరపడ్డగారిపల్లెలోని బాలికల గురుకుల పాఠశాలలోని 1174మంది బాలికలకు వారి భవితకు భరోసాను అందించే 10సూత్రాలు తెలియజేసే పుస్తకాలు, అట్టలను వితరణ చేసి అందజేశారు.బాలికలకు ధైర్యం ఒక్కమాటలో ఎవ్వరు చెప్పలేరని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు.